క్లుప్తంగా

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి

కడప కల్చరల్ : కడప నగరంలోని మురాదియా నగర్‌లోగల అస్తానె మురాదియా దర్గా 135వ ఉరుసు ఉత్సవాల పోస్టర్లను శనివారం పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా మహమ్మద్ జమాలుల్లాబాష సాహెబ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈనెల 24 నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 24న రాత్రి గంధం , 25న ఉరుసు, 26న తహలీల్ ఫాతెహా నిర్వహిస్తామన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. సలీంబాషా, అలుమ్నీ ప్రతినిధులు తెలిపారు. కళాశాల స్వర్ణోత్సవ వేడుకలకు సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో కళాశాల ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు చదువుతున్న విద్యార్థినులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

రక్తదానం



కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా శనివారం బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో బ్లడ్ టూ లీవ్ సహకారంతో రిమ్స్ వైద్యుల పర్యవేక్షణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం సేకరిస్తున్న రక్తనిల్వలను తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్లు రాజశేఖర్, అయ్యూబ్, రమేష్, లీడ్ డిస్ట్రిక్ట్ చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, రీజినల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులతో నెహ్రూ యువకేంద్రం ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: యువత అభివృద్ధిని సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర సమన్వయకర్త ఎ.ఆర్. విజయరావు పేర్కొన్నారు. శనివారం కడప నగరం బాలాజీనగర్‌లోని యూత్‌హాస్టల్‌లో స్వచ్ఛంద సేవాసంస్థలు, వలంటీర్లతో 'మేరీ దేశ్.. మేరీ మట్టి' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ఐక్యతను చాటే ఇలాంటి కార్యక్రమాల్లో యువత స్వచ్ఛందంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

26న పంచనదీ హారతి

కడప కల్చరల్ : ఈనెల 26 న కార్తీక పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి క్షేత్రంలో పంచనదీ హారతి నిర్వహించనున్నామని కడప నగరానికి చెందిన ఆశారేఖ ఫౌండేషన్ చైర్ పర్సన్ నెమలిదిన్నె నాగవేణి తెలిపారు. శనివారం ఆమె కడప నగరంలోని తన కార్యాలయంలో విలేకరులకు ఈ విషయాన్ని తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు నది వద్ద హారతి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.

పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

– జడ్జి ప్రదీప్‌కుమార్



కడప ప్రభుత్వ బాలుర గృహంలో మాట్లాడుతున్న జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్

కడప అర్బన్: పిల్లల ఆరోగ్యం, అభ్యసించే విద్య పట్ల తల్లిదండ్రులు, గురువులు అప్రమత్తంగా వుండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ అన్నారు. బాలల హక్కుల దినోత్సవం వారోత్సవాల సందర్భంగా శనివారం కడప నగరంలోని ప్రభుత్వ బాలుర గృహంను జడ్జి ప్రదీప్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ క్రమంలోనే బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు, విద్య హక్కు, నైతిక విలువలు, రాజ్యాంగ సంస్థల పట్ల గౌరవం మొదలగు అంశాల పట్ల అవగాహన కలిగించారు. తల్లిదండ్రులు, గురువులు పిల్లల ఆరోగ్య విషయాలపట్ల అభ్యసించే విద్య పట్ల తగు జాగ్రత్తలు వహిస్తూ వున్నపుడు వారు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి వీలవుతుందన్నారు. బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2015 గురించి వివరించారు. పిల్లలు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. చదివిన సంస్థకు, తల్లిదండ్రులకు మంచిపేరును తీసుకునిరావాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్లు 100, 1098 పైన అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చునన్నారు. అనంతరం వంటశాలలను, మధ్యాహ్నం భోజనం మెనూను పరిశీలించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ సాంబశివరావు, చిల్డ్రన్ హోం సూపరింటెండెంట్ వీరయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ దేవరాజు పాల్గొన్నారు.

శాశ్వత లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్



మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్

వైవీయూ : శాశ్వత లోక్ అదాలత్‌తో సత్వర న్యాయపరిష్కారం పొందవచ్చని జిల్లా శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో న్యాయసేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రజా వినియోగిత సేవలు, చట్టాలపై అవగాహన ఉండాలని సూచించారు. పర్మినెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పుతో సమానమని పేర్కొన్నారు. ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయపరిష్కారం పొందవచ్చని తెలిపారు. అనంతరం లోక్‌అదాలత్, శాశ్వత లోక్‌అదాలత్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డి.ఎస్.ఆర్. మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ ఎస్.పి. మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగమణి, లోక్ అదాలత్ సభ్యులు ఆదినారాయణ, ఎం.వి. సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీమను విస్మరించిన బీజేపీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బీజేపీ ప్రభుత్వం రాయలసీమ ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించిందని డీసీసీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరాభవన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మోడీ పాలనలో రాయలసీమకు నవ మోసాలు, నవ దోషాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామలమ్మ, పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సమాయత్తం కావాలి

ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తం కావాలని డీసీసీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. శనివారం ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: కడప రీజనల్ పరిధిలోని 8 జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయుల సర్వీస్ మ్యాటర్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని వైఎస్సార్‌టీఎఫ్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఓబుళపతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డిలు కోరారు. ఈ విషయమై శనివారం కడపలో పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న లెక్చరర్లకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులను కల్పించాలన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం క్రిస్టియన్ లేన్‌లోని శ్రీ అక్షయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం స్త్రీల ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గైనకాలజిస్టు డాక్టర్ సాగర్‌కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే వైద్యశిబిరంలో స్త్రీలకు సంబంధించి అన్ని వ్యాధులకు వైద్య సేవలు అందిస్తామన్నారు. శిబిరంలో రక్త పరీక్షలు, గర్భవతులకు స్కానింగ్, మందులు ఉచితంగా అందజేస్తామన్నారు.

నేడు బహుమతి ప్రదానం

కడప కల్చరల్: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ ఆదివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించనున్నామని సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ తెలిపారు. వారోత్సవాలను పురస్కరించుకుని వారం రోజులపాటు నగరానికి చెందిన విద్యార్థులకు నిర్వహించిన పలు రకాల పోటీలలో విజేతలకు అధికారులు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. విజేతలు తప్పక ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

చక్కటి పనితీరుకు ప్రభుత్వం గుర్తింపు



మాట్లాడుతున్న నోడల్ రీసోర్స్ సెంటర్ ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

వైవీయూ : డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు ప్రదర్శించే పనితీరుకు ప్రభుత్వం పురస్కారాలను అందజేయనున్నట్లు ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. కళాశాలను నోడల్ రిసోర్స్ సెంటర్‌గా ఎంపిక చేయడంతో పాటు మరో ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించే అధికారాన్ని నోడల్ సెంటర్‌కు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో తొలిసమావేశాన్ని శనివారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ, వార్షికోత్సవ వేడుకలు, విద్యార్థుల ప్రతిభ, వివిధ పోటీల్లో వారి ప్రదర్శన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతపురంలో డిసెంబర్ రెండోవారంలో నిర్వహించనున్న ఆన్యువల్ ఫెస్టివల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచే కళాశాలలకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల, వేంపల్లి, పెండ్లిమర్రి, మైదుకూరు, యర్రగుంట్ల, పోరుమామిళ్ల డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పురాతన నాణేల ప్రదర్శన



నాణేలను తిలకిస్తున్న వయోజన విద్య అధికారి సుబ్బారెడ్డి

కడప కల్చరల్ : పురాతన నాణేల ప్రదర్శన నేటితరం వారికి చరిత్రను చూపించగలదని వయోజన విద్య ఉప సంచాలకులు వెంకట సుబ్బారెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పురాతన నాణేల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. వెంకట సుబ్బారెడ్డి ఈ ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడుతూ పురాతన నాణేల సేకరణ ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నదని, వీటిని సేకరించిన ఎస్.రంగనాథ్ ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ చేసిన అనంతరం పూర్తి సమయాన్ని వీటి సేకరణలోనే గడిపారన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు దైనందిన జీవితంలో మంచి అలవాట్ల అవసరం గురించి వివరించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్‌తో కలిసి సుబ్బారెడ్డి నాణేల సేకర్త రంగనాథ్‌ను సత్కరించారు. అనంతరం ప్రముఖ గ్రంథాలయ ఉద్యమ నాయకుడు అనే అంశంపై డాక్టర్ ఎంవీఎన్ సుధారాణి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, స్వాతంత్ర్య బాబు తదితరులు మాట్లాడారు.

ప్రత్యేక వైద్యశిబిరం

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఆవరణలో వున్న జిల్లా బాలభవిత కేంద్రంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా హీమోఫిలియాతో బాధపడుతున్న పిల్లల కోసం శనివారం ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లలకు రక్తపరీక్షలు చేయించారు. డీఈఐసీలో వున్న పిల్లలకు ఫిజియోథెరఫీ, డెంటల్, ఆప్తాల్, హియరింగ్, సైకాలజీకి సంబంధించిన సేవలను అందించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ఫకృద్దీన్, ఇతర వైద్యులు నిర్వహించారు.

దిశా చట్టంపై అవగాహన

కమలాపురం : ఆపదలో ఉన్న మహిళలను రక్షించే దిశా చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తులశమ్మ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ నాగాంజలి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ నార్త్‌జోన్ జట్టుకు ఫార్మసి విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: జేఎన్‌టీయూ నార్త్‌జోన్ జట్టుకు కడప నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 7వ తేదీన స్థానిక ఎస్ఆర్ఎస్ కళాశాలలో జేఎన్‌టీయూ నిర్వహించిన ఖోఖో మహిళల విభాగంలో నిర్మల ఫార్మసీ కళాశాలలో బి. ఫార్మసీ నాల్గవ సంవత్సరం చదువుతున్న విజయలక్ష్మి సౌత్‌జోన్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే పుట్‌బాల్‌కు సంబంధించి పురుషుల విభాగంలో 3వ సంవత్సరం చదువుతున్న జీకె జాశిల్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ ఇద్దరు విద్యార్థులు త్వరలో తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో నిర్వహించే జాతీయ క్రీడల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మెన్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్, పీడీ తిరుమలయ్య అభినందించారు.

సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు .. కడప యస్వీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బిటెక్ నాల్గవ సంవత్సరం చదువుతున్న ధనుష్‌కుమార్‌రెడ్డి సౌత్ జోన్ క్రికెట్ పోటీలలో భాగంగా అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ క్రికెట్ టీఎంకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీర సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ధనుష్‌ను కళాశాల వైస్ చైర్మన్లు అంబవరం ప్రకాష్, అంబవరం ప్రదీప్, ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి అభినందించారు.

ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గుంటి వేణుగోపాల్

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన కార్డు ప్రైమ్ 2.0 విధానంలో ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలని అఖిలపక్ష, ప్రజా సంఘాల నేతలు కోరారు. శనివారం స్థానిక పాత రిమ్స్‌లో దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి నగర సమితి ఆధ్వర్యంలో నగర అధ్యక్షులు ఉల్లి సంజీవ రాయుడు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా దస్తావేజులేఖర్లుగా, స్టాంపు వెండర్లుగా పనిచేస్తున్న వారు ప్రైమ్ 2.0 విధానం వలన ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. ఈ విధానం అమలుకు ముందు ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల వారితో చర్చించి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. తక్షణమే కార్డు ప్రైమ్ 2.0 విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దస్తావేజులేఖర్ల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి వేణుగోపాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్, జనసేన జిల్లా కన్వీనర్ సుంకర శ్రీనివాసులు, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సత్తార్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుర్రప్ప పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



మాట్లాడుతున్న జిల్లా సహకారశాఖ అధికారి అరుణకుమారి

కడప కల్చరల్ : కడప నగరంలోని కో–ఆపరేటివ్ కాలనీలోని ది కడప కో–ఆపరేటివ్ సొసైటీ కళ్యాణ మండపంలో శనివారం 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంఘం కో ఆపరేటివ్ గృహ నిర్మాణ సంఘం అధ్యక్షులు జయభారత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా సహకారశాఖ అధికారి అరుణకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా సంఘం ద్వారా సభ్యులకు తక్కువ వడ్డీతో రుణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రైతుల పురోభివృద్ధికి ప్రాథమిక వ్యవసాయ శాఖ సహకార సంఘాల ద్వారా వివిధ రకాల రుణ సౌకర్యాలను కల్పించామని తెలిపారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించడం స్ఫూర్తిదాయకమన్నారు. వారికి అతిథులచే జ్ఞాపికలను అందజేశారు. అనంతరం అతిథులను సంఘం అధ్యక్షుడు పి జయభారత్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి జి సుభాషిణి, కో ఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, కో ఆపరేటివ్ సబ్ డివిజన్ అధికారి సత్యానందం, కడప సహకార గృహ నిర్మాణ సంఘం పాలకవర్గ సభ్యులు పీవీ శేషారెడ్డి పాల్గొని మాట్లాడారు.

డీబీటీ పథకంతో నాణ్యమైన ఉచిత విద్యుత్

కడప కార్పొరేషన్ : నగదు బదిలీ(డీబీటీ) పథకం ద్వారా రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందుతుందని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్.రమణ అన్నారు. శనివారం స్థానిక విద్యుత్ భవన్‌లో వ్యవసాయ విద్యుత్‌కు నగదు బదిలీ పథకం (డీబీటీ పథకం) పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయానికి ఇస్తున్న ఉచిత విద్యుత్‌కు నగదు బదిలీ (డీబీటీ పథకం) విధానాన్ని అమలు చేయుటకు వ్యవసాయ వినియోగదారుల నుంచి సేకరించవలసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు యుద్ధ ప్రాతిపదికన సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ అకౌంట్ ప్రక్రియ పూర్తి అవగానే ప్రభుత్వము రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్‌కు సంబంధించిన సబ్సిడీని వ్యవసాయ వినియోగదారుల అకౌంట్ల నుంచి డిస్కములకు జమ చేస్తుందన్నారు. డీబీటీ పథకం ద్వారా రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడమే కాకుండా సంస్థకు ప్రతి యూనిట్ అకౌంటబిలిటీలోకి వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ఎల్లమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : స్థానిక సొసైటీ కాలనీలో వెలసిన ఎల్లమ్మతల్లి విగ్రహం పునఃప్రతిష్టా మహోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఆర్‌వీఎస్‌ఆర్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ఈ విగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవాలకు శనివారం ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ హాజరయ్యారు. నిర్వాహకులు బాణా సంచాపేల్చుతూ, కోలాటం చేస్తూ, డప్పు వాయిద్యాల నడుమ పూర్ణ కుంభంతో ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం నిర్వాహకులు వారిని సత్కరించారు.